# వేగుచుక్క


పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ డిసెంబర్ 04 బుధవారం 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 131

పంచాయతీరాజ్ చట్టసవరణపై **ప్రభుత్వం కసరత్తు** 2లో


PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




2లో..

## మహారాష్ట్రలో ఆశ్చర్యకర రాజకీయ పరిణామాలు

"షిండే మళ్లీ సీఎంగా రావాలి" అంటూ బ్యానరు



2లో..

## ఢిల్లీకి రావాలంటేనే విసుగు కలుగుతోంది!

కాలుష్యం కారణంగా ఇన్‌ఫెక్షన్ సోకుతుంది

కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ కీలక వ్యాఖ్యలు

# హైదరాబాద్ గ్లోబల్ సిటీగా మారుస్తాం



- హైదరాబాద్ అభివృద్ధికి కేంద్రం సహకారం కావాలి
- కేంద్రం నుండి రూ. 10 వేల కోట్లు తీసుకురండి
- పదేళ్లు తెలంగాణను భ్రష్టు పట్టించిన కేసీఆర్
- అప్పుల ఊబిలోకి నెట్టేసిన ఘనత కేసీఆర్ దే
- రైజింగ్ ఉత్సవాలలో సీఎం రేవంత్ రెడ్డి
- హెచ్ఎండీఏ గ్రౌండ్స్ లో రైజింగ్ ఉత్సవాల నిర్వహణ

హైదరాబాద్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తా ఎవరెన్ని కుట్రలు పన్నినా అభివృద్ధి ఆగదు నిధులు తెస్తరా? గుజరాత్ కు వలసపోతారా? కిషన్ రెడ్డిని నిలదీసిన సీఎం రేవంత్ రెడ్డి మూసీ ప్రక్షాళనతో నిర్వాసితులకు అండగా ఉన్నాం నిద్రలు చేయడం మాని నిధులుతీసుకురండి ఒక్క రూపాయి కూడా కిషన్ రెడ్డి తీసుకురాలేదు

2లో..



2లో..

## నియంత పాలనకు చరమ గీతం పాడి ఏడాది

గడీల పాలనతో రాష్ట్రం విసిగిపోయింది

కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్



2లో..

## ఆదిలాబాద్‌లో వెంటాడుతున్న పులి భయం

భయాందోళనలకు గురవుతున్న ప్రజలు



# నేర నియంత్రణ చట్టాలు బలమైన ముందడుగు

బ్రిటిష్ భావజాలం నుంచి మనం బయటపడాలి

భారతీయులను లొంగదీసుకునేందుకు ఆనాటి చట్టాలు

చండీఘడ్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రధాని మోడీ

**చండీఘడ్:** రాజ్యాంగం కన్నకలలను సాకారం చేసేందుకు దేశంలో అమల్లోకి వచ్చిన సరికొత్త నేర నియంత్రణ చట్టాలు బలమైన ముందడుగుగా ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు. బ్రిటిష్ వలస విధానం నుంచి మనం బయటపడాల్సి ఉందన్నారు. చండీగఢ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. స్వాతంత్య్రం వచ్చిన 70 ఏళ్లలో దేశం ఎదుర్కొంటున్న పలు సమస్యలను జాగ్రత్తగా అధ్యయం చేసి వీటిని రూపొందించారన్నారు. ఈ సందర్భంగా సుప్రీం కోర్టు, హైకోర్టు న్యాయమూర్తులకు ధన్యవాదాలు తెలిపారు. ఆంగ్లేయులు వెళ్లిపోయాక వారి చట్టాల

మిగతా 2లో

# లక్ష కేసులు పెట్టినా సరే

## ప్రజా కోర్టులో నీకు శిక్ష తప్పదు : హరీశ్‌రావు



**హైదరాబాద్:** సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు తీవ్రంగా మండిపడ్డారు. మిస్టర్ రేవంత్ రెడ్డి అడుగడుగునా నువ్వు చేస్తున్న అన్యాయాలను నిలదీస్తున్నందుకు, నీ నిజ్వస్వరూపాన్ని బట్టబయలు చేస్తున్నందుకు, ప్రజల పక్షాన నీ మీద ప్రశ్నలు సంధిస్తున్నందుకు భరించలేక, సహించలేక నామీద అక్రమ కేసులెన్నో బనాయిస్తున్నావని మండిపడ్డారు. నీకు చేతనైంది ఒక్కటే.. తప్పు చేసి దబాయించడం, తప్పుడు కేసులు బనాయించడమని విమర్శించారు. రుణమాఫీ విషయంలో దేవుళ్లను సైతం దగా చేసినవు అని అన్నందుకు యాదగిరి గుట్ట పోలీసు స్టేషన్‌లో తనపై తప్పుడు కేసు పెట్టించాడని రేవంత్ రెడ్డిపై హరీశ్‌రావు మండిపడ్డారు. ఇచ్చిన హామీలను ఎగవేస్తున్న నిన్ను ఎగవేతల రేవంత్ రెడ్డి అని అన్నందుకు బేగం బజార్ పోలీసు స్టేషన్‌లో తప్పుడు కేసు పెట్టించినవని అన్నారు. సోషల్ మీడియాలో ఎవరో పెట్టిన పోస్టుకు సైబర్ క్రైం పోలీసు స్టేషన్ లో నా మీద సంబంధం లేని కేసు పెట్టించినవని విమర్శించారు. పార్టీ కార్యక్రమంలో మాట్లాడితే కోడిగుడ్డుమీద ఈకలు పీకి, తలాతోక లేని కేసొకటి మానకొండూరులో అక్రమ కేసు పెట్టించినవని అన్నారు. నీ రెండు నాల్కల వైఖరిని బట్టబయలు చేసినందుకు, ప్రజాక్షేత్రంలో నిలదీసినందుకు తట్టుకోలేక ఇవాళ పంజాగుట్ట స్టేషన్‌లో మరో తప్పుడు కేసు పెట్టించారని తెలిపారు.నువ్వు లక్ష తప్పుడు కేసులు పెట్టించినా, నేను ప్రజల పక్షాన ప్రశ్నించడం ఆపనని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

# భవనాల లే ఔట్ల అనుమతులు మరింత సరళం

- బిల్డ్ నౌ యాప్‌ను ప్రారంభించిన ప్రభుత్వం
- రియల్ రంగంలో హైదరాబాద్‌దే అగ్రస్థానం
- నిబంధనలు సరళతరం చేయాలన్న లక్ష్యం
- ఐటి శాఖ మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి

**హైదరాబాద్:** భవనాలు, లే అవుట్ల అనుమతులకు 'బిల్డ్ నౌ' పేరుతో కొత్త ఆన్‌లైన్ విధానాన్ని తెలంగాణ ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. 'బిల్డ్ నౌ' పేరుతో ఏర్పాటు చేసిన యాప్‌తో పాటు, విధానాన్ని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు మంగళవారం ప్రారంభించారు. సచివాలయంలో బిల్డ్ నౌ అనే యాప్ ను అందుబాటులోకి తీసుకువచ్చారు. పట్టణాభివృద్ధిలో గతంలో లేని విధంగా అభివృద్ధి కార్యక్రమాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నామని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. రాష్ట్రంలో దాదాపు 60 శాతం మంది జనాభా పట్టణ, నగర ప్రాంతాల్లో ఉంటున్నందున ఈ శాఖ ప్రాధాన్యతపై దృష్టి పెట్టి.. స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి పర్యవేక్షిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో వ్యాపారాలకు అనువైన వాతావరణం కల్పిస్తున్నాం. గత ప్రభుత్వం తీసుకొచ్చిన అభివృద్ధి విధానాలను కొనసాగిస్తున్నాం. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా



నెరవేరుస్తున్నాం. గతంలో ఎన్నడూ లేని విధంగా పథకాలు అమలు చేస్తున్నాం. స్థిరాస్తి రంగంలో ఇప్పటికీ హైదరాబాద్ ప్రథమ స్థానంలో ఉంది. హైదరాబాద్ ప్రజలే గృహ రుణాలు అధికంగా తీసుకుంటున్నారని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు.తెలంగాణ ప్రభుత్వం నూతన సమగ్ర భవనాలు , లేఅవుట్ల ఆమోదానికి సంబంధించిన వ్యవస్థ బిల్డ్ నౌ అన్నారు. ఇది అత్యాధునిక ప్రజాపాలన దిశగా ఒక విప్లవాత్మక అడుగు. భారతదేశంలోనే వేగవంతమైన డ్రాయింగ్ స్క్రూటినీ వ్యవస్థ ఇది నిదర్శనమని అన్నారు. ఈ నూతన వ్యవస్థ విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టబోతోంది. అనుమతులు, డ్రాయింగ్ స్క్రూటినీ ప్రాసెసింగ్ సమయాన్ని వారాల నుంచి నిమిషాలకు తగ్గిస్తుంది. పనితీరులో ఇది ఒక బెంచ్ మార్క్ గా నిలుస్తుందని మంత్రి తెలిపారు.

# ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శ్రీకారం
- రాష్ట్రంలో 4 లక్షల 50 వేల ఇళ్ల మంజూరు
- ఒక్కో నియోజకవర్గానికి 3500 చొప్పున ఇళ్ల కేటాయింపు
- ఈనెల 6నుంచి గ్రామాల్లో అధికారులు పర్యటన
- లబ్ధిదారులను గుర్తించనున్న అధికారులు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటన

హైదరాబాద్:తెలంగాణ రాష్ట్రంలో డిసెంబర్ 5న ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శ్రీకారం చుట్టబోతున్నట్లు రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలంలో మంగళవారం (డిసెంబర్ 03) వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్?తో కలిసి ఆయన విస్తృత పర్యటన చేశారు. ఈ సందర్భంగా రూ.3 కోట్ల 62 లక్షల విలువైన పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.అనంతరం జరిగిన సభలో మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో 4 లక్షల 50 వేల ఇళ్లను మంజూరు చేస్తున్నామని చెప్పారు. ప్రతి నియోజకవర్గానికి 3500 చొప్పున ఇళ్లను కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. ఈ నెల 6వ తేదీ నుంచి గ్రామాల్లో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, లబ్ధిదారులను గుర్తించనున్నట్లు పేర్కొన్నారు. గతంలో అధికారంలో ఉన్న బీఆర్?ఎస్? ప్రభుత్వం ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల కుంపటిగా మార్చిందని మండిపడ్డారు. ప్రతి నెల రూ.6 వేల 500 వందల కోట్లు అసలు, వడ్డీ కలిపి చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం



చేశారు.రేషన్? కార్డు లేని వారికి ప్రభుత్వం ఇటీవల గుడ్? న్యూస్? చెప్పింది. రేషన్ ?కార్డు లేకపోయినా ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని స్పష్టం చేసింది. మొదటి విడతలో వీరికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపింది. ఈ విషయాన్ని స్వయంగా రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గతంలో వెల్లడించారు. రేషన్? కార్డు లేని పేద ప్రజలకు ఇది నిజంగా శుభవార్తనే చెప్పాలి. ఖమ్మం జిల్లా కూసుమంచిలోని క్యాంప్? కార్యాలయంలో గత నెలల జరిగిన నియోజకవర్గ పరిధి సమావేశంలో ఈ ప్రకటన చేశారు. తిరుమలాయపాలెం

మండలం కాంగ్రెస్? శ్రేణులు, అధికారుల సంయుక్త సమావేశం నిర్వహించారు. కాగా గతంలో రేషన్ ?కార్డు లేకపోయినా ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని స్పష్టం చేసింది. మొదటి విడతలో వీరికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపింది. ఈ విషయాన్ని స్వయంగా రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. రేషన్? కార్డు లేని పేద ప్రజలకు ఇది నిజంగా శుభవార్తనే చెప్పాలి.

వేగుచుక్క

## చేతకాకపోతే కేంద్ర హ్వాం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలి

**చేయాలని ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ డిమాండ్**

**న్యూఢిల్లీ :** దేశ రాజధానిలో అస్తవ్యస్తమైన శాంతిభద్రతలను పరిరక్షించడం చేతకాకపోతే కేంద్ర హ్వాం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ డిమాండ్ చేశారు. అంతటా గందరగోళంగా ఉంది, పెరుగుతున్న నేరాల కారణంగా ప్రజలు తమ ఇళ్ల నుండి బయటకు రావడానికి భయపడుతున్నారు. పితంపుర స్లమ్ క్లస్టర్‌లో తన ఇంటి వెలుపల కత్తితో పొడిచి చంపబడిన యువకుడి బంధువులను కలిసిన తర్వాత కేజ్రీవాల్ ఈ ఆరోపణలు చేశారు. "ఇద్దరు యువకులపై ఏడెనిమిది మంది స్థానిక యువకులు దాడిచేశారు. మనీశ్ అనే యువకుడిని అనేకమార్లు పొడిచి చంపారు. అతడిని సకాలంలో ఆసుపత్రికి చేర్చకపోవడం వల్ల చనిపోయాడు. హిమాంశు అనే మరో యువకుడిని రక్షించగలిగారు. అయితే సాక్షి వాంగ్మూలాన్ని పోలీసులు రికార్డు చేయలేదు" అని కేజ్రీవాల్ తెలిపారు. "ఒకవేళ అమిత్ షా ఢిల్లీలో శాంతిభద్రతల పరిస్థితిని పరిరక్షించలేకపోతే, కేవలం దేశంలో రాజకీయ పర్యటనలకే పరిమితమైతే ఆయన రాజీనామా చేయాలి" అని మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ అన్నారు. పోలీసులు బాధితులనే బెదిరిస్తున్నారే తప్ప చర్యలు చేపట్టడం లేదని అన్నారు. దీనిపై ఢిల్లీ పోలీసుల ప్రతిస్పందన కరువయింది. కారణం కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అదుపు వారిపై ఉందని కేజ్రీవాల్ ఆరోపించారు. మాదక ద్రవ్యాల దుర్వినియోగం, గొలుసు దొంగతనాలు, ఇతర నేరాలు ఢిల్లీలో పెరిగిపోతున్నాయని, తనకు అనేక ఫోన్ కాల్స్ వస్తున్నాయని, తమ ప్రాంతానికి వచ్చిపొమ్మని కోరుతున్నారని తెలిపారు. తాను ప్రజల సమస్యలను లేవనెత్తుతానని అన్నారు. ఇదిలావుండగా కేజ్రీవాల్ ఢిల్లీలో పాలిస్తున్న ఆప్ ప్రభుత్వ అవినీతి నుంచి దృష్టి మళ్లించడానికే ఇలా శాంతిభద్రతల అంశాన్ని లేవనెత్తుతున్నారని బిజెపి ఆరోపించింది.

## వాయిదా నోటీసులు తిరస్కరించిన రాజ్యసభ చైర్మన్ ధన్‌ఖడ్

**రాజ్యసభలో మంగళవారం మామూలుగా కార్యకలాపాలు జీరో అవర్‌లో ఎస్‌పి వాకౌట్**

న్యూఢిల్లీ :రోజుల పాటు సభా కార్యకలాపాలు తుడిచిపెట్టుకుపోయిన తరువాత రాజ్యసభ మంగళవారం మామూలుగా పని చేసింది. ప్రజా ప్రాధాన్యం ఉన్న అంశాలను సభ్యులు ప్రస్తావించారు. సభ నిర్ణీత జీరో అవర్‌ను ముందు చేపట్టింది. ఆ తరువాత ప్రశ్నోత్తరాల సమయం సాగింది. అదానీ గ్రూప్‌పై అవినీతి ఆరోపణలు, యుపి సంభాల్‌లో హింసాకాండ సహా పలు సమస్యలపై ప్రతిపక్ష సభ్యులు రభస సృష్టిస్తుండడంతో నవంబర్ 25న శీతాకాల సెషన్ ప్రారంభమైనప్పటి నుంచి రాజ్యసభ ఎటువంటి కార్యకలాపాన్నీ నిర్వహించలేకపోయింది. కాగా, మంగళవారం జీరో అవర్ (ఉదయం సెషన్)లో సమాజ్‌వాది పార్టీ (ఎస్‌పి) సభలో నుంచి వాకౌట్ చేసింది. టిఎంసి సభ్యులు కూడా కొద్ది సేపు వాకౌట్ చేశారు. 267 నిబంధన కింద తనకు 42 వాయిదా నోటీసులు అందాయని, రాజ్యాంగాన్ని ఆమోదించిన శతాబ్ది చివరి త్రైమాసికంలో ఇంత వరకు ఇవే అధికమని చైర్మన్ జగ్దీప్ ధన్‌ఖడ్ అంతకుముందు చెప్పారు. తాను నోటీసుల్లో దేనినీ అంగీకరించలేదని ఆయన తెలిపారు. ఎంపి ఒకరు 267 నిబంధన కింద ఒకటికి మించి నోటీసులు ఇచ్చారని, ఆ సభ్యునికి వాటి ప్రస్తావనకు అవకాశం ఇవ్వడం ఏమాత్రం సాధ్యం కాదని ధన్‌ఖడ్ స్పష్టం చేశారు. 267 కింద నోటీస్‌ను పరిశీలించే ముందే బహిరంగపరచడం పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అది 'నిబంధనలను బేఖాతరు చేయడమే' అని, అది మరీ తీవ్రమైన విషయమని చైర్మన్ అభివర్ణించారు. వివిధ పార్టీల నేతల దృష్టికి దీనిని తీసుకువెళ్లనున్నట్లు ఆయన చెప్పారు. అత్యున్నత నైతిక ప్రమాణాలు పాటించవలసిందిగా సభ్యులకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఆ తరువాత సభ జీరో అవర్ ప్రస్తావనలతో సాగింది. చైర్మన్ ముందస్తు అనుమతితో ఆ సమయంలో అంశాలను సభ్యులు ప్రస్తావించారు. తమిళనాడులో ఫెంగల్ తుపాను సృష్టించిన సమస్యలను ఎం మొహమద్ అబ్దుల్లా (డిఎంకె), వైకో (ఎండిఎంకె) సభ దృష్టికి తీసుకువచ్చారు. ఒడిశా పూరిలో ప్రతిపాదిత అంతర్జాతీయ విమానాశ్రయాన్ని పూర్తి చేసి, పని చేయించాలని సుభాశీశ్ ఖుంతియా (బిజెడి) కోరారు. రామ గోపాల్ యాదవ్ (ఎస్‌పి) సంభాల్‌లో ఇటీవలి హింసాకాండ అంశాన్ని లేవదీశారు. కాంగ్రెస్ ఎంపి ప్రమోద్ తివారి కూడా ఆ అంశంపై మాట్లాడారు

## సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగిస్తే శని, ఆదివారం కూడా సభ పెడ్తా

**లోక్‌సభలో సభ్యులను హెచ్చరించిన స్పీకర్ ఓమ్ బిర్లా**

న్యూఢిల్లీ : వాయిదాల కారణంగా సభా కార్యకలాపాలకు మరింత అంతరాయం వాటిల్లిన పక్షంలో ఆ సమయం నష్టాన్ని భర్తీ చేయడానికి వారాంతాల్లో తాను సభా కార్యక్రమాలను నిర్వహించవలసి వస్తుందని లోక్‌సభ స్పీకర్ ఓమ్ బిర్లా మంగళవారం సభ్యులను హెచ్చరించారు. పార్లమెంట్‌లో వారం రోజులుగా సాగుతున్న ప్రతిష్టంభనను అంతం చేయడానికి ప్రభుత్వం, ప్రతిపక్షాలు సోమవారం ఒక ఒప్పందానికి వచ్చిన విషయం విదితమే. రాజ్యాంగాన్ని ఆమోదించిన 75వ వార్షికోత్సవం సందర్భంగా లోక్‌సభ, రాజ్యసభలలో రాజ్యాంగంపై చర్చకు తేదీలను ప్రకటించడమైంది. రాజ్యాంగంపై దిగువ సభలో ఈ నెల 13, 14 తేదీల్లోను, ఎగువ సభలో 16, 17 తేదీల్లోను చర్చ చేపడతారు. మంగళవారం ప్రశ్నోత్తరాల సమయం ముగిసిన వెంటనే స్పీకర్ బిర్లా మాట్లాడుతూ.. 'సభ 14 ఉదయం 11 గంటలకు సమావేశం అవుతుంది. మీరు వాయిదాలు కొనసాగించినట్లయితే వాయిదా పడిన రోజులకు సంబంధించి మీరు శని, ఆదివారాల్లో కూడా సభా కార్యకలాపాలకు హాజరు కావలసి ఉంటుంది' అని స్పష్టం చేశారు. మంగళవారం ఎటువంటి వాయిదా నోటీసుల వర్తమానాన్నీ తాను అనుమతించలేదని కూడా బిర్లా చెప్పారు. అదానీ వివాదం, ఉత్తర ప్రదేశ్ సంభాల్‌లో ఇటీవలి హింసాకాండ, తదితర సమస్యలపై ప్రతిపక్ష సభ్యుల నిరసనల కారణంగా క్రితం వారం లోక్‌సభ కార్యకలాపాలు తుడిచిపెట్టుకుపోయాయి.

## దేశంలో తగ్గిన బంగారం ధరలు..

హైదరాబాద్ :దేశంలోని ప్రజలందరూ పండగలు, పెళ్ళిళ్ళు అంటూ అనేక సంధర్భాల్లో బంగారం కొనుగోలు చేస్తూనే ఉంటారు. ధర ఎంత అయినా ఉండని సందర్భాన్ని బట్టి కొనుగోలు చేస్తారు. అయితే బంగారం ధరలు స్థిరంగా అసలు ఉండవు. ధరలు రోజురోజుకి పెరుగుతూనే ఉంటాయి. ఒకసారి ధరలు పెరుగుతే మరోసారి తగ్గుతాయి. ఈ క్రమంలో బంగారం కొనడానికి ప్రజలు వెనకడుతారు. ఈరోజు అనగా డిసెంబర్ 3వ తేదీ మంగళవారం నాడు దేశ వ్యాప్తంగా అన్ని ప్రధాన నగరాల్లో, తెలుగు రాష్ట్రాల్లో బంగారం తాజా ధరలు:ఢిల్లీ..22 క్యారెట్ల పసిడి ధర రూ.71,040..24 క్యారెట్ల ధర రూ.77,490,..ముంబై..22 క్యారెట్ల ధర రూ.70,890..24 క్యారెట్ల ధర రూ.77,340,..చెన్నై...22 క్యారెట్ల రేట్ రూ.70,890,..24 క్యారెట్లు రూ.77,340,...బెంగళూరు..22 క్యారెట్ల ధర రూ.70,890...24 క్యారెట్ల ధర రూ.77,340,..తెలుగు రాష్ట్రాల్లో ...హైదరాబాద్..22 క్యారెట్ల ధర రూ.70,890,..24 క్యారెట్ల ధర రూ.77,340,..విశాఖపట్నం...22 క్యారెట్ల ధర రూ.70,890,..24 క్యారెట్ల ధర రూ.77,340,..విజయవాడ;..22 క్యారెట్ల ధర రూ.70,89024 క్యారెట్ల ధర రూ.77,340.

## నాపై ఎన్ని అక్రమ కేసులు పెట్టుకుంటావో పెట్టుకో..



హైదరాబాద్ :;ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు మరో?సారి నిప్పులు చెరిగారు. "నాపై ఎన్ని అక్రమ కేసులు పెట్టుకుంటావో పెట్టుకో.. తగ్గేదే లేదు.. నిన్ను ప్రజా కోర్టులో శిక్షించే వరకు ఆగేది లేదు" అని ఎక్స్ వేదికగా సీఎం రేవంత్ పై ఫైరయ్యారు. మంగళవారం పంజాగుట్ట పోలీసులకు హరీశ్ రావుపై కాంగ్రెస్ నేత చక్రధర్ గౌడ్ ఫిర్యాదు చేశారు. బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు హరీశ్ రావు తన ఫోన్ ట్యాప్ చేయించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో పోలీసులు హరీశ్ రావు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో ఎక్స్ వేదికగా స్పందించిన ఆయన.. సీఎం రేవంత్ తనపై అక్రమ కేసులు పెట్టిస్తున్నారంటూ మండిపడ్డారు."అడుగడుగునా నువ్వు చేస్తున్న అన్యాయాలను నిలదీస్తున్నందుకు, నీ నిజ్వస్వరూపాన్ని బట్టబయలు చేస్తున్నందుకు, ప్రజల పక్షాన నీమీద ప్రశ్నలు సంధిస్తున్నందుకు భరించలేక, సహించలేక.. నామీద అక్రమ కేసులెన్నో బనాయిస్తున్నావు. నీకు చేతనైంది ఒక్కటే.. తప్పు చేసి దబాయించడం, తప్పుడు కేసులు బనాయించడం. రుణమాఫీ విషయంలో దేవుళ్లను సైతం దగా చేసినవు అని అన్నందుకు యాదగిరి గుట్ట పోలీసు స్టేషన్ లో తప్పుడు కేసు పెట్టించినవు. ఇచ్చిన హామీలను ఎగవేస్తున్న నిన్ను ఎగవేతల రేవంత్ రెడ్డి అని అన్నందుకు బేగం బజార్ పోలీసు స్టేషన్ లో తప్పుడు కేసు పెట్టించినవు. సోషల్ మీడియాలో ఎవరో పెట్టిన పోస్టుకు సైబర్ క్రైం పోలీసు స్టేషన్ లో నా మీద సంబంధం లేని కేసు పెట్టించినవు. పార్టీ కార్యక్రమంలో మాట్లాడితే కోడిగుడ్డుమీద ఈకలు పీకి, తలాతోక లేని కేసొకటి మానకొండూరులో అక్రమ కేసు పెట్టించినవు.

నీ రెండు నాల్కల వైఖరిని బట్టబయలు చేసినందుకు, ప్రజాక్షేత్రంలో నిలదీసినందుకు తట్టుకోలేక ఇవాళ పంజాగుట్ట స్టేషన్ లో మరో తప్పుడు కేసు పెట్టించినవు. నువ్వు లక్ష తప్పుడు కేసులు పెట్టించినా, నేను ప్రజల పక్షాన ప్రశ్నించడం ఆపను. ప్రజా కోర్టులో, ప్రజా తీర్పుతో నీకు తగిన శిక్ష పడేంత వరకు ఆగను" అంటూ దుయ్యబట్టారు.

## ఇంకా చలామణిలో రూ.6,839 కోట్ల విలువైన రూ.2000 నోట్లు

న్యూ డిల్లీ : ఇంకా రూ.6,839 కోట్ల విలువైన రూ.2000 నోట్లు చలామణిలో ఉన్నాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తాజాగా ప్రకటించింది. 2023 మే 19న రూ.2000 నోట్లను చలామణి నుంచి ఉపసంహరిస్తున్నట్లు ఆర్బీఐ ప్రకటించింది. నాటి నుంచి నవంబర్‌లో వ్యాపారం ముగిసే సమయానికి చలామణి నుంచి దాదాపు 98.08 శాతం మేర రూ.2వేల నోట్లు తిరిగి బ్యాంకింగ్ వ్యవస్థలోకి వచ్చాయని తెలిపింది. ప్రస్తుతం రూ.6,839 కోట్ల విలువైన రూ.2వేల నోట్లు ప్రజల వద్ద ఉన్నాయని, అవి రావాల్సి ఉందని స్పష్టం చేసింది.కాగా, 2023 మే 19న చలామణి నుంచి రూ.2,000 నోట్లను ఉపసంహరిం చుకుంటున్నట్టు ఆర్బీఐ ప్రకటించిన విషయం తెలిసిందే. నాడు చలామణిలో ఉన్న ఈ నోట్ల విలువ రూ.3.56 లక్షల కోట్లు. ఇదిలావుంటే నిరుడు అక్టోబర్ 7దాకా దేశంలోని అన్ని బ్యాంక్ శాఖల్లో రూ.2,000 నోట్ల మార్పిడి జరిగింది. ఆ తర్వాత నుంచి హైదరాబాద్‌తోపాటు దేశవ్యాప్తంగా ఉన్న 19 ఆర్బీఐ కార్యాలయాల్లో మాత్రమే ఈ మార్పిడికి వీలుంది. అహ్మదాబాద్, బెంగళూరు, బేలాపూర్, భోపాల్, భువనేశ్వర్, చండీగఢ్, చెన్నై, గౌహతి, హైదరాబాద్, జైపూర్, జమ్మూ, కాన్పూర్, కోల్‌కతా, లక్నో, ముంబై, నాగ్‌పూర్, న్యూఢిల్లీ, పాట్నా, తిరువనంతపురంలోని ఆర్బీఐ శాఖల్లో రూ.2వేల నోట్లు మార్చుకోవచ్చు. కాగా, కేంద్ర ప్రభుత్వం నవంబర్ 2016లో రూ. 2000 నోట్లను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. అప్పుడు చలమాణిలో ఉన్న రూ. 1,000, రూ.500 నోట్లను రద్దు చేసి రూ.2వేల నోట్లను చలామణిలోకి తెచ్చింది.

## పంచాయతీరాజ్ చట్టసవరణపై ప్రభుత్వం కసరత్తు

**హైదరాబాద్:** తెలంగాణలో త్వరలోనే పంచాయతీ ఎన్నికలకు నగరా మోగనుంది. అయితే అది బీసీ కులగణన తర్వాతే. అందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. తెలంగాణలో 12,992 పంచాయతీలు ఉన్నాయి. సర్పంచ్ కాల పరిమితి ముగియడంతో స్పెషల్ ఆఫీసర్ పాలనలో పంచాయతీలు నడుస్తున్నాయి. బీసీ రిజర్వేషన్ల పెంచుతామని కాంగ్రెస్ సర్కార్ ఎన్నికల హామీ ఇవ్వడంతో అందుకు తగ్గట్టుగా ఇప్పుడు బీసీ కుల గణన జరుగుతోంది. ఈ సర్వే తర్వాత బీసీ జనాభా దామాష పద్దతిన పంచాయతీలు బీసీలకు రిజర్వే చేయనున్నారు. అయితే ఇందు కోసం పంచాయతీ రాజ్ బిల్లులో మార్పులు చేయాల్సి ఉంది. అందుకు తగ్గట్టుగా వచ్చే శాసనసభ సమావేశాల్లో పంచాయతీ రాజ్ బిల్లులో సవరణలు చేయనున్నారు. కేవలం బీసీ రిజర్వేషన్ల కోసమే కాకుండా మరి కొన్ని మార్పులు ఉండే అవకాశం ఉందని పంచాయతీ రాజ శాఖ అధికారులు చెబుతున్నారు. బీఆర్ఎస్ సర్కార్ హాయంలో అంటే 2018లో పంచాయతీ రాజ్ బిల్లు తీసుకువచ్చింది. అందులో పదేళ్ల కోమారు అంటే రెండు టర్మ్‌ల తర్వాతే రిజర్వేషన్ల మార్పుపై నిర్ణయం తీసుకునేలా చట్టంలో పేర్కొంది. అంతకు మునుపు ప్రతీ ఐదేళ్లకు రిజర్వేషన్లు మార్పు ఉండేది. కాని కేసీఆర్ హాయంలో దాన్ని పదేళ్లకు చేసింది. ప్రతీ ఐదేళ్లకు రిజర్వేషన్ల మార్పు వల్ల ఎన్నికలు ఆలస్యం అవుతున్నాయని, అభివృద్ధి కుంటుపడుతుందని అప్పటి ప్రభుత్వం చెప్పింది. ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్ సర్కార్ దీన్ని ఐదేళ్లకు కుదించేందుకు సిద్ధమవుతోంది. ఈ మేరకు బిల్లులో మార్పులు తెచ్చేందుకు పంచాయతీ రాజ్ శాఖ సిద్దమవుతోంది. ప్రస్తుత పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం సర్పంచ్‌లను సస్పెండ్ చేసే అధికారం కలెక్టర్లకు ఉంది.

# హైదరాబాద్ గ్లోబల్ సిటీగా మారుస్తాం



హైదరాబాద్: హైదరాబాద్ గ్లోబల్ సిటీగా మార్చాలనేది తమ ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం మాయమాటలు చెప్పి తెలంగాణ రాష్ట్ర ప్రజలను మోసం చేసిందన్నారు. హైదరాబాద్ నగర సుందరీకరణకు ప్రత్యేక నిధులు కేటాయించి, నగరానికి కావలసిన మౌలిక సదుపాయాలపై తాము ప్రత్యేక దృష్టి సారించామన్నారు. హైదరాబాద్ లోని ఎన్టీఆర్ మార్గ్ వద్ద గల హెచ్ఎండీఏ గ్రౌండ్స్ లో హైదరాబాద్ రైజింగ్ ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్న సందర్భంగా ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా రైజింగ్ ఉత్సవాలను నిర్వహించారు. ఈ ఉత్సవాలలో భాగంగా తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన స్టాల్స్ ను సీఎం రేవంత్ రెడ్డి పరిశీలించారు. సీఎం వెంట డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్ గ్లోబల్ సిటీగా మార్చాలనేది తమ ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమన్నారు. గత ప్రభుత్వం మాయమాటలు చెప్పి తెలంగాణ రాష్ట్ర ప్రజలను మోసం చేసిందన్నారు. హైదరాబాద్ నగర సుందరీకరణకు ప్రత్యేక నిధులు కేటాయించి, నగరానికి కావలసిన మౌలిక సదుపాయాలపై తాము ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ప్రపంచం మొత్తం హైదరాబాద్ వైపు చూసేలా మూసీ సుందరీ కరణ పేరుతో నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని, ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా అభివృద్ధి విషయంలో తాము వెనుకడుగు వేయబోమన్నారు. హైదరాబాద్ నగరం అంటేనే దేశంలో ఒక ప్రత్యేకమైన గుర్తింపు గల నగరంగా పేరుగాంచిందన్నారు. ఈ నగరం ఎందరో యువకులకు ఉపాధినిస్తుందని, ఏపీ సీఎం చంద్రబాబుతో పాటు ఎందరో నాయకులు, ఐటీ కంపెనీలను హైదరాబాద్ కు తీసుకువచ్చి నగరం అభివృద్ధికి దోహద పడ్డారన్నారు. పిజెఆర్ వల్లే గోదావరి జలాలు నగరానికి వచ్చాయని తెలిపారు. న్యూయార్క్, టోక్యో వంటి నగరాలకు పోటీనిచ్చే సత్తా ఉన్న నగరంగా హైదరాబాద్ ను తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని సీఎం తెలిపారు. ఎన్నో కంపెనీలు ఇక్కడ ఉన్నాయని, ప్రభుత్వానికి 65 శాతం ఆదాయం ఇక్కడి నుండే వస్తుందన్నారు. తెలంగాణ మణిహారంగా రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణం సాగిస్తున్నామని, 7 వేల కోట్లతో హైదరాబాద్ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్ర మంత్రి హోదాలో గల సికింద్రాబాద్ ఎంపీ కిషన్ రెడ్డి, కేంద్రంతో మాట్లాడి ఒక్క రూ.10 వేల కోట్లు తీసుకురావాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మూసీ ప్రక్షాళన పేరిట తాము నిర్వాసితులకు అండగా నిలబడుతుంటే, అక్కడికి వెళ్లి నిద్రలు చేయడం మాని కేంద్రం నుండి నిధులు తీసుకురావాల్సిన భాద్యత కిషన్ రెడ్డిపై ఉందన్నారు. ఇప్పటికీ ఒక్క రూపాయి కూడా కిషన్ రెడ్డి తీసుకు రాలేదని ఈ విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. హైదరాబాద్ అభివృద్ధికి కేంద్రం సహకారం కావాలని, నిధులు తెస్తరా? గుజరాత్ కు వలసపోతారా? మూసీ ప్రక్షాళనకు కేంద్రం నుంచి ఎంత నిధులు తీసుకొస్తవ్ అంటూ సీఎం ప్రశ్నించారు. పదేళ్లు తెలంగాణను భ్రష్టు పట్టించిన కేసీఆర్ ఇప్పుడు ఫామ్ హౌస్ కి పరిమితమై, తాము చేసే అభివృద్ధికి అడ్డు పెట్టడం ఎలా అంటూ ఆలోచిస్తున్నారని సీఎం రేవంత్ అన్నారు. ట్యాంక్ బండ్ నీరు పాలమాదిరిగా మారుస్తామని హామీలిచ్చి, పదేళ్లు అప్పుల ఊబిలోకి నెట్టేసిన ఘనత కేసీఆర్ కే దక్కుతుందన్నారు. బీఆర్ ఎస్ , బీజేపీలపై చర్చించేందుకు తాను సిద్దమని, మీ పాలసీ డాక్యుమెంట్ ను తెలంగాణ సమాజానికి చూపించండంటూ సీఎం సవాల్ విసిరారు. హైదరాబాద్ నగర అభివృద్ధికి తాము కట్టుబడి, వేల కోట్ల రూపాయలతో ఎన్నో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఉప ముఖ్యమంత్రి అధ్వర్యంలో మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేస్తామని, అఖిల పక్ష సమావేశం సైతం నిర్వహిస్తామన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ లు ఏమేమి సలహాలు ఇస్తారో ఇవ్వండి అంటూ సీఎం పిలుపునిచ్చారు. రాజధాని గుండా ప్రవహిస్తున్న మూసీ నదికి పునరుజ్జీవం తీసుకువచ్చి మురికి కూపంలో ఉన్న ప్రజల జీవన ప్రమాణాలు పెంచుతామన్నారు. దాంతో పాటు హైదరాబాదు నగరాన్ని గ్లోబల్ సిటీగా మార్చి పర్యాటకంగా, అందంగా అభివృద్ధి చేసి, మూసిని జీవ నదిగా మార్చాలని తమ ప్రభుత ముందుకుపోతందన్నారు. ఇది ప్రతిపక్షాలకు ఇష్టం లేదని అందుకే అడ్డుపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ నగరం గుండా 55 కిలోమీటర్ల పైగా ప్రవహిస్తున్న మూసీ నదిని పూర్తిగా ప్రక్షాళన చేసి పునరుజ్జీవం తీసుకురావడానికి ప్రజా ప్రభుత్వం ముందుకు పోతున్నది. గోదావరి నీళ్లను తీసుకువచ్చి మూసీలో కలిపి పునరుజ్జీవం తీసుకువస్తామన్నారు. పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసి విద్య ఉపాధి అవకాశాలు పెంచుతామన్నారు. ఇక రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కదిలించలేమన్న భయంతో కుట్రపూరితంగా బిఆర్ఎస్ తన సోషల్ మీడియా ద్వారా ప్రజలను రెచ్చగొడుతుందన్నారు. హైదరాబాద్ నగరం మీద ప్రేమ, పేదవాళ్లపై అభిమానం ఉంటే సహకరించాల్సింది పోయి కుట్రలు చేయడం మానుకోవాలని బిఆర్ఎస్ నాయకులకు సూచించారు. హైదరాబాద్ నగరం అభివృద్ధి చెందితే ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయన్నారు.

## ఆదిలాబాద్‌లో వెంటాడుతున్న పులి భయం

ఆదిలాబాద్: ఆదిలాబాద్? రూరల్? మండలంలోని పలు గ్రామాల్లో పులి సంచరిస్తుందని కొంతమంది పాత వీడియోలను సోషల్ మీడియాలో వైరల్ చేయడంతో గ్రామీణ ప్రజలు సోమవారం భయాందోళనకు గురయ్యారు. పత్తి తీసేందుకు వెళ్లిన మహిళలు భయంతో ఇంటిబాట పట్టారు. కొంతమంది పులి సంచారం నిజమా? అబద్ధమా అని ఆయా గ్రామాల వారికి ఫోన్‌లు చేసి తమ సందేహాన్ని నివృత్తి చేసుకున్నారు. దీంతో పాటు మండలంలోని యాపల్‌గూడ పంచాయతీ పరిధిలోని రాములగూడలో ఓ మహిళ పులి అడుగు జాడలను చూసినట్లు చెప్పడంతో స్థానికంగా కలకలం రేపింది. సమాచారమందుకున్న అటవీ శాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని అడుగులను పరిశీలించారు. ఆ తర్వాత తంతోలి, అంకోలి, కొత్తూరు, చింతగూడ గ్రామాల్లో బెబ్బులి సంచరిస్తుందంటూ కొంతమంది సామాజిక మాధ్యమం వేదికగా వదంతులను సృష్టించారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు భయం భయంగా బిక్కుబిక్కుమంటూ పొలాల నుంచి ఇంటికి చేరుకున్నారు. వాంకిడి మండల కేంద్రానికి సమీపంలోని పత్తి చేనులో పులి కనిపించింది అనే వార్త కలకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన ఇటన్‌కర్ తుకారాం అనే వ్యక్తికి పత్తి చేనులో సోమవారం ఉదయం 7గంటల సమయంలో బెబ్బులి కనిపించింది. పాలేరు మారుతి పురుగుమందు పిచికారీ చేస్తుండగా కనిపించడంతో అతడు వెంటనే గ్రామానికి వచ్చి గ్రామస్థులు, అటవీ అధికారులకు ఈ సమాచారం తెలియజేశారు. అనంతరం ఆ స్థలాన్ని సందర్శించి పరిశీలించగా పాదముద్రలు స్పష్టంగా కనిపించక పోవడంతో పులి కాకపోయి ఉండవచ్చని ఫారెస్ట్? ఉపరేంజి అధికారిణి ఝాన్సీలక్ష్మి, బీట్ అధికారి శ్రీనివాస్‌లు వెల్లడించారు.

## నేర నియంత్రణ చట్టాలు బలమైన ముందడుగు



నుంచి విముక్తి లభిస్తుందని భావించారు. అసలు భారత్‌పై పట్టుబిగించేందుకు ఏం చేయడానికైనా సిద్ధపడి వారు ఆ చట్టాలను చేశారు. కానీ, స్వాతంత్య్రం వచ్చాక కూడా దురదృష్టవశాత్తు ఆ పాత చట్టాల చుట్టూ పాలకులు తిరిగారు. కానీ, ఇప్పుడు దేశం ఆ వలసపాలకుల మనస్తత్వం నుంచి బయటపడింది' అని పేర్కొన్నారు. 'చండీగఢ్‌కు వస్తే.. నా మనుషుల మధ్యకు వచ్చినట్లు ఉంటుంది. ఈ నగరం శక్తిస్వరూపిణి చండీ అమ్మవారి పేరుతో ముడిపడింది. ఆమె సత్యం, న్యాయాన్ని నిలబెట్టారు. ఇదే భావనతో భారత న్యాయసంహిత చట్టాలు ఉన్నాయి. వీటి పరిధిలోకి దేశం రావడం చాలా గొప్ప ఆరంభం. ప్రజల కోసం మన రాజ్యంగా ఏమి ఆదర్శాలను ఊహించుకున్నామో వాటిని పూర్తి చేయడానికి ఇవొక కీలక ప్రయత్నం. ఈ చట్టాలు ఎలా అమలు చేస్తారనేది లైవ్ డెమో చూశాను. ప్రజలు కూడా వీటిని చూడాలని కోరుతున్నానని అన్నారు. దేశంలోని సరికొత్త న్యాయసంహిత చట్టాలు సమగ్రమైనవి. వీటిని తయారీ పక్రియ కూడా చాలా విస్తృతంగా ఉంది. దీనిలో ఎంతో మంది నిపుణుల కష్టం దాగి ఉంది. హోమ్ మంత్రిత్వశాఖ 2020 జనవరిలో అభిప్రాయాలు కోరింది. సుప్రీం కోర్టు, హైకోర్టులు, న్యాయవిద్యాలయాలు, పౌర సంస్థలు, మేధావులు ఏళ్ల తరబడి చర్చించి, తమ అనుభవాలను రంగరించారు. గతంలో ఎదురైన సవాళ్లను విశ్లేషించారు.

### ఢిల్లీకి రావాలంటేనే విసుగు కలుగుతోంది!

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్యస్థాయి తీవ్రంగా పెరుగుతుండటంతో ఇక్కడకు రావాలంటేనే విసుగు కలుగుతోందని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. తనకు ఢిల్లీలో నివసించడం ఏమాత్రం ఇష్టం ఉండదన్నారు. కాలుష్యం కారణంగా ఇన్‌ఫెక్షన్ సోకుతుండటంతో తనకు ఢిల్లీకి రావాలనిపించడం లేదన్నారు. ఢిల్లీలో కాలుష్యం బాగా ఉందన్నారు.తాను ఢిల్లీకి వచ్చే ప్రతిసారీ కాలుష్యం భయంతో వెళ్లాలా? వద్దా? అని ఆలోచిస్తుంటానన్నారు. శిలాజ ఇంధనాల వినియోగాన్ని తగ్గించడమే కాలుష్య నివారణకు ఉత్తమ మార్గమన్నారు. మన దేశం ప్రస్తుతం రూ.22 లక్షల కోట్ల విలువైన శిలాజ ఇంధనాలను దిగుమతి చేసుకుంటోందన్నారు. లక్షల కోట్ల విలువైన దిగుమతుల నేపథ్యంలో ఈ ప్రభావం మన ఆర్థిక వ్యవస్థ, పర్యావరణం, జీవావరణంపై పడుతోందన్నారు. ప్రత్యామ్నాయ ఇంధనాలను ప్రోత్సహించడం ద్వారా శిలాజ ఇంధనాల దిగుమతులను తగ్గించుకోవచ్చని వ్యాఖ్యానించారు.

## మహారాష్ట్రలో ఆశ్చర్యకర రాజకీయ పరిణామాలు

**"షిండే మళ్లీ సీఎంగా రావాలి" అంటూ బ్యానర్లు**

బాంబే: మహారాష్ట్రలో గురువారం నాడు నూతన ప్రభుత్వ ప్రమాణ స్వీకారోత్సవానికి ఓవైపు ఏర్పాట్లు జరుగుతున్నప్పటికీ, సీఎం పదవి విషయంలో అనిశ్చితి కొనసాగుతూనే ఉంది. ముఖ్యమంత్రిగా దేవేంద్ర ఫడ్నవీస్, డిప్యూటీ సీఎంగా ఏక్ నాథ్ షిండే... వీలైతే మరో డిప్యూటీ సీఎంగా అజిత్ వార్... ప్రస్తుతానికి ఈ సమీకరణం ప్రచారంలో ఉంది. బీజేపీ హైకమాండ్ చెప్పిన మాట వింటానని ఏక్ నాథ్ షిండే చెబుతున్నప్పటికీ, షిండేనే మళ్లీ ముఖ్యమంత్రిగా రావాలని బ్యానర్లు వెలిశాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ఇదొక ఆసక్తికర పరిణామం. తాజాగా ఛత్రపతి శంభాజీ నగర్ లో షిండే బొమ్మతో భారీ బ్యానర్లు, హోర్డింగ్ లు దర్శనమిచ్చాయి. ఆపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్ నాథ్ షిండేనే మళ్లీ ముఖ్యమంత్రిగా రావాలంటూ ఆ బ్యానర్లపై పేర్కొన్నారు. అంతేకాదు, షిండేను 'మరాఠా సర్దార్' అని అభివర్ణించారు. ఔరంగాబాద్ లోని జాల్నా రోడ్ లో ఉన్న బాంబే హైకోర్టు బెంచ్ సమీపంలోనూ బ్యానర్లు కనిపించాయి. వీటిని సకల్ మరాఠా సమాజ్ అనే సంస్థ ఏర్పాటు చేసింది. ఈ సంస్థ గత కొన్నాళ్లుగా మరాఠా రిజర్వేషన్ల కోసం పోరాడుతోంది.

## నియంత పాలనకు చరమ గీతం పాడి ఏడాది

హైదరాబాద్,: రాష్ట్రంలో నియంత పాలనకు చరమ గీతం పాడి ఏడాది అయ్యింది. ప్రజా పాలన ఏర్పాటుకు సంపూర్ణంగా సహకరించిన తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు కాంగ్రెస్ అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్ గడీల పాలన, ఫామ్ హౌస్ పాలనతో విసిగిపోయింది తెలంగాణ. అవినీతి, కుటుంబ పాలనకు స్వస్తి పలికి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటైంది. సంపూర్ణ మెజారిటీ ఇచ్చి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు మద్దతు ఇచ్చిన ప్రజలకు ధన్యవాదాలు చెప్పారు.ఏడాది పాలనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మిగతా మంత్రుల సమిష్టి నిర్ణయాలతో తొలి ఏడాది అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో వెలిగిపోతోందన్నారు. ప్రస్తుతం రైజింగ్ తెలంగాణగా ఉందన్న విషయం ప్రజలకు అందరికి తెలుసన్నారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం చేయలేనంత అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందన్నారు టీపీసీసీ. ముఖ్యంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత సదుపాయం, ఆరోగ్య శ్రీ 10 లక్షల పెంపు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయలకు గ్యాస్ కనెక్షన్ ఇచ్చి మాట నిలబెట్టుకున్నామని తెలిపారు.రైతులకు రెండు లక్షల రుణమాఫీ కోసం 21 వేల కోట్ల రూపాయల కేటాయించిందన్నారు. దీని ద్వారా 23 లక్షల మందికి లబ్ది జరిగిందన్ని విషయాన్ని వక్కానించారు మహేష్‌కుమార్. ధాన్యం 500 రూపాయల బోనస్‌తో రైతులకు ఎంతో మేలు జరిగిందన్నారు. ఒక్క ఏడాదిలో సుమారు 54 వేల 500 ఉద్యోగాలు ఇచ్చి యువతను అదుకుందని, స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ లు ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. డ్రగ్స్ నివారణకు కృషి జరుగుతోందని వివరించారు.ఇక మూసీ నది పునర్జీవనం ఒక అద్భుతమైన పథకంగా వర్ణించారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఓ వైపు పథకాలు.. మరోవైపు అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ఏడాదిలో అన్ని రకాలుగా సహకరించిన ప్రజలకు తన వంతు ధన్యవాదాలు తెలిపారు తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్.

# కాంగ్రెస్ ఏడాది పాలనలో ప్రజలకు ఏం చేశారు?

**హామీలు మరచి, ప్రజలను వంచించి విజయోత్సవాలు. సీఎం రేవంత్ రెడ్డికి నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ బహిరంగ లేఖ.**

-( వేగుచుక్క న్యూస్- కుంచె వెంకటేష్)






గౌరవనీయులైన
శ్రీ ఏనుముల రేవంత్ రెడ్డి గారికి,
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి
సచివాలయం, హైదరాబాద్.

## బహిరంగ లేఖ.

విషయం: సంవత్సర కాలంపాటు సాగిన మీ కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలన అంధకారం లోకి నెట్టబడిన తెలంగాణ రాష్ట్ర భవితవ్యం.
ఈ లేఖ ద్వారా మిమ్మల్ని కొన్ని ప్రశ్నలు అడగాలి అనుకుంటున్నాను. సంవత్సర కాలంలో రాష్ట్ర ప్రజలకు ఏంచేశారని ప్రజాపాలన విజయోత్సవాల పేరిట ప్రజా ధనాన్ని దుర్వినియోగం చెయ్యడానికి నాంది పలికారు.నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ ప్రజల తరపున ఈ బహిరంగ లేఖ ద్వారా నేను అడుగుతున్న నా ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్న, ఎన్నికల సమయంలో మీరు చేసిన వాగ్దానాలను నెరవేర్చుటలో గడిచిన సంవత్సర కాలంలో తెలంగాణ రాష్ట్రంలో మీ ప్రభుత్వం ఎంతవరకు సఫలీకృతం అయ్యారో నా లేఖకు భహిరంగముగా సమాధానం చెప్పి తెలంగాణ ప్రజల పట్ల మీ యొక్క చిత్తశుద్ధి నిరూపించుకోగలరు.




- ఏకకాలంలో రైతులకు 2 లక్షల రుణమాఫీ పూర్తి స్థాయిలో జరగనందుకా,
రైతులకు, కౌలు రైతులకు 15000 రూ. రైతుభరోసా ఇవ్వనందుకా ఈ విజయోత్సవాలు ?
- వ్యవసాయ కూలీలకు 12000 రూ.ఇవ్వడంలో విఫలమైనందుకా, వరి పంటకు 500 రూపాయలు ఇవ్వనందుకా, ప్రతి పేదింటి మహిళకు 2500 రూ.ఇవ్వనందుకా ఈ విజయోత్సవాలు?.
- కల్యాణ లక్ష్మి /షాదీముబారక్ తో తులం బంగారం కేవలం మాటలకు పరిమితం చేసినందుకా,చదువుకునే ప్రతి ఆడపిల్లకు ఎలక్ట్రికల్ స్కూటీ ఇస్తామన్న హామీ ప్రచారానికే పరిమితం చేసినందుకా,
నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వనందుకు ఈ విజయోత్సవాలు?.
- యువవికాసం పేరుతో యువతను మోసం చేసినందుకా,
నిరుద్యోగ భృతి 4వేల పేరుతో యువతను మోసం చేసినందుకా, అంబేద్కర్ అభయ హస్తం పేరిట ఎస్సీ, ఎస్టీలకు 12లక్షలు అంటూ దళితులను దగా చేసినందుకా,కార్పొరేషన్ల అభివృద్ధికి 750 కోట్ల నిధులు ఇస్తామని నమ్మబలికి -నమ్మకద్రోహం చేసినందుకా, విద్యాజ్యోతి పథకం నీరుకార్చినందుకా ఈ విజయోత్సవాలు ?.
- బీసీ సంక్షేమానికి ఏడాదికి 20 వేల కోట్ల నిధులు ఇస్తామని బిసిలను మోసం చేసినందుకా, గొల్లకూరుమలకు 2వ దశ గొర్ల పంపిణీ అంటూ మోసం చేసినందుకా, విద్యార్థులకు ఫీ రియంబర్స్మెంట్ బకాయిలు 6500 కోట్లు ఇప్పటివరకు చెల్లించనందుకా ఈ విజయోత్సవాలు ?.
- అర్హులైన వారికీ కొత్త రేషన్ కార్డులు ఇవ్వనందుకా,
ఆటో డ్రైవర్స్ కు 12000 ఆర్థిక సహాయం చేస్తామని డ్రైవర్ అన్నల పొట్ట కొట్టినందుకా, బెల్ట్ షాపుల రద్దు అంటూ మద్యం ఏరులై పారుతున్నందుకా, జూనియర్ న్యాయవాదులకు నెలకు 5 వేలు ఇవ్వనందుకా ఈ విజయోత్సవాలు ?.
- జర్నలిస్టుల సంక్షేమానికి 100 కోట్ల నిధులు కేటాయించనందుకా,
చేయూత పథకం క్రింద 4000 రూ. వృద్దులకు ఫెన్షన్ ఇవ్వనందుకా, గల్ఫ్ లో మరణించిన వారి కుటుంబాలకు 5 లక్షల రూ. ఇవ్వనందుకా, గురుకుల పాఠశాలలలో ఆహారాన్ని కలుషితం చేసి విద్యార్థుల ఉసురు తీస్తున్నందుకు ఈ విజయోత్సవాలు ?.
- తెలంగాణాలో డ్రగ్స్ నియంత్రణ చెయ్యడంలో విఫలం అయినందుకు ఈ విజయోత్సవాలా ?, హిందువుల ఆరాధ్య దేవి దేవతలపైన, గుడుల పైన జరుగుతున్నా దాడులకు ఈ విజయోత్సవాలా.

ఇట్లు
ధన్ పాల్ సూర్యనారాయణ,
నిజామాబాదు అర్బన్ శాసనసభ్యులు.

# ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం.

- పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్.







ఉద్యోగులకు మరియు నిరుద్యోగులకు, దివ్యాంగుల కమిటీ సభ్యులకు ప్రశంసా పత్రాలు, సన్మానాలు చేశారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవము సందర్భముగా నవంబర్ 21న నిర్వహించిన వివిధ రకాల క్రీడలలో గెలుపొందిన దివ్యాంగ విద్యార్థినీ విద్యార్థులకు మరియు దివ్యాంగులకు బహుమతుల ప్రధానం చేయడం జరిగింది.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, డిసెంబర్ 3:**

మహిళ, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల మరియు ట్రాన్స్ జెండర్స్ సంక్షేమ శాఖా ఆద్వర్యంలో రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా నిజామాబాదు అర్బన్ ఎమ్మెల్యే దన్పాల్ సూర్య నారాయణ గుప్తా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమములో జిల్లా న్యాయ సేవా అధికారిణి, సెక్రెటరీ పద్మావతి, అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) అంకిత్, మహిళా కమిషన్ సభ్యురాలు సుదాం లక్ష్మి , జిల్లా వైద్య ఆరోగ్య శాఖా అధికారిణి రాజశ్రీ, డి.ఆర్.డి.వో. ప్రాజెక్ట్ డైరెక్టర్ డి. సాయాగౌడ్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి పర్యవేక్షకులు డా. ప్రతిమా రాజ్, స్నేహ సొసైటీ సెక్రెటరీ, శ్రీ సిద్ధయ్య, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబర్, గ్రేసి ఆర్గనైజషన్ ప్రెసిడెంట్ శోభా రాణీ, స్నేహ సొసైటీ ప్రిన్సిపాల్ జ్యోతి, ఎ.పి. ఫోరం ప్రెసిడెంట్ సి. స్వరూప, పాల్గొని అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవముపై తమ తమ అమూల్యమైన సందేశాన్ని అందించారు. స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీ కన్స్ట్రక్షన్, గ్రేసి ఆర్గనైజషన్ ఫర్ డెవలప్మెంట్ సర్వీసెస్, ఏపీ ఫోరమ్ ఫర్ ఎకనామికల్లి వీకర్ సెక్షన్, మొదలైన స్వచ్చంద సంస్థలచే నడుపబడుచున్న ప్రత్యేక పాటశాలలో విద్య నభ్యసిస్తున్న దివ్యాంగ బాల బాలికలు యోగా మరియు ఇతరా సాంస్కృతిక కార్యక్రమాలు చేసి కార్యక్రమానికి హాజరైన వారిని అలరించారు. తదుపరి జిల్లాలో వివిధ కేటగిరీలకు చెందిన పలు అతిధులకు మరియు
వివిధ ప్రభుత్వ శాఖ లలో పనిచేస్తున్న దివ్యాంగ



## మల్లయ్య డెడ్ బాడీ భద్రపరచండి..

### ములుగు ఎన్‌కౌంటర్‌పై హైకోర్టు..

హైదరాబాద్ :ములుగు ఎన్కౌంటర్ కేసుపై హైకోర్టులో మంగళవారం విచారణ చేపట్టింది. మృతదేహాలను పోస్ట్ మార్టం ప్రక్రియ సరిగ్గా చేయలేదని పిటిషనర్ తరుపు న్యాయవాది వాదనలు వినిపించారు. దీనికి ప్రభుత్వ తరుపు న్యాయవాది సమాధానమిస్తూ.. 8 మంది వైద్య నిపుణులతో పంచనామా పూర్తి చేశామని కోర్టుకు తెలిపారు.అనంతరం, ఎన్కౌంటర్ పరిణామాలతో పాటు తదుపరి చర్యలు, పోస్ట్ మార్టం రిపోర్ట్‌ను అందజేయాలని పోలీసులను న్యాయస్థానం ఆదేశించింది. మృతి చెందిన మల్లయ్య మృతదేహం తప్ప మిగిలిన మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించాలని కోర్టు చెప్పింది. అయితే.. మృత దేహాలు భద్రపరచడం ద్వారా శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని ప్రభుత్వ తరుపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. దీంతో తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేస్తున్నట్లు కోర్టు వెల్లడించింది

## విశాఖ, విజయవాడ మెట్రోలకు గ్రీన్ సిగ్నల్

విజయవాడ:విశాఖ మెట్రోరైల్ ప్రాజెక్టు మొదటి దశ డీపీఆర్, విజయవాడ మెట్రో రైల్ మొదటి దశ డీపీఆర్‌లకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. మొదట విశాఖ మెట్రోరైల్ డీపీఆర్ ను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించించింది. విశాఖ మెట్రో మొదటిదశలో 46.23 కిలోమీటర్ల మేర మూడు కారిడార్ల నిర్మాణం చేపట్టనున్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ నుంచి కొమ్మాది వరకూ 34.4 కిలోమీటర్ల మేర విశాఖ మెట్రోరైలు ఒకటో కారిడార్ గా డీపీఆర్‌లో ప్రభుత్వం పేర్కొంది.గురుద్వారా నుంచి పాతపోస్ట్ ఆఫీసు వరకూ 5.08 కిలోమీటర్ల మేర రెండో కారిడార్ ను నిర్మించనున్నారు. మూడో కారిడార్ గా తాడిచెట్ల పాలెం నుంచి చినవాల్తేర్ వరకూ 6.75 కిలోమీటర్ల మేర నిర్మాణం చేపట్టాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. విశాఖపట్నం మెట్రోరైలు ప్రాజెక్టు మొదటి దశలో మొత్తం 11,498 కోట్ల రూపాయల వ్యయం అవుతుందని అంచనా వేశారు. రెండో దశలో 30.67 కిలోమీటర్ల మేర కొమ్మాది నుంచి భోగాపురం విమానాశ్రయం వరకూ కారిడార్ నిర్మాణం చేపడతారు. ఏపీ ప్రభుత్వం నిర్ణయం అనంతరం ఈ మేరకు పురపాలక శాఖ కార్యదర్శి కె.కన్నబాబు ఉత్తర్వులు జారీ చేశారు. విజయవాడ మెట్రో రైల్ ప్రాజెక్టు మొదటి దశ డీపీఆర్‌కు సైతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టును రెండు దశల్లో (కారిడార్ 1ఎ, 1బిగా) మొత్తంగా 38.4 కిలోమీటర్ల మేర నిర్మాణం చేపట్టాలని సర్కార్ భావిస్తోంది. విజయవాడ మెట్రో ఫేజ్ 1కు సంబంధించిన డీపీఆర్ను మెట్రో రైల్ కార్పొరేషన్ రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించింది. ఆ డీపీఆర్‌కు ప్రభుత్వం ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు జారీ చేసింది. విజయవాడ మెట్రో రైల్ ప్రాజెక్టును మొత్తంగా రూ.11,009 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. కారిడార్ 1ఎ, బి లాగ విజయవాడ మెట్రో నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. మెట్రో ప్రాజెక్టుకు భూసేకరణ కోసం రూ.1,152 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం వెచ్చించేలా డీపీఆర్ సిద్ధం చేసింది. విజయవాడ మెట్రోరైలు రెండో దశలో భాగంగా మూడో కారిడార్‌ను దాదాపు 27.75 కిలోమీటర్ల మేర నిర్మించాలని సర్కార్ యోచిస్తోంది. మెట్రో 1ఎ కారిడార్లో భాగంగా గన్నవరం నుంచి పండిట్ నెహ్రూ బస్టాండ్ వరకు నిర్మిస్తారు.

# అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు.

## - పాల్గొన్న ఎమ్మెల్యే, కలెక్టర్.

**వేగుచుక్క న్యూస్, బోధన్, డిసెంబర్ 3**



: బోధన్ పట్టణంలో పలు అభివృద్ధి పనులకు మంగళవారం స్థానిక శాసన సభ్యులు పి. సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. బోదన్ లోని ప్రభుత్వ ఆసుపత్రిలో రూ. 15 లక్షలతో నిర్మించిన అదనపు గదులను ప్రారంభించారు. రూ. 66 లక్షలతో చేపట్టనున్న బోదన్ మండల ప్రజా పరిషత్ నూతన భవన నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. అన్ని హంగులతో ప్రభుత్వం నూతనంగా నిర్మించదల్చిన సమీకృత రెసిడెన్షియల్ విద్యా సంస్థలు, వసతి గృహ సముదాయం కోసం బెల్లాల్ సమీపంలోని మధుమలంచా డిగ్రీ కళాశాల వద్ద స్థలాన్ని పరిశీలించారు. శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ గిరిజన బాలుర వసతి గృహాన్ని పరిశీలించారు. బోధన్ లోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో డీసీహెచ్ఎస్ శ్రీనివాస్ ప్రసాద్, ఇతర వైద్యాధికారులతో సమావేశమై, వైద్యుల ఖాళీలు, మౌలిక సదుపాయాల కల్పనపై చర్చించారు. ఖాళీగా ఉన్న డాక్టర్లు, స్టాఫ్ నర్సుల పోస్టులను వెంటనే భర్తీ అయ్యేలా చూడాలని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. అభివృద్ధి పనులలో పాల్గొన్న సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్యా, వైద్య రంగాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ఇందులో భాగంగానే అన్ని విద్యా సంస్థలు ఒకే ప్రాంగణంలో ఉండేలా బెల్లాల్ మధుమలంచ డిగ్రీ కళాశాల వద్ద సుమారు 25 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ కం హాస్టల్స్ భవన సముదాయం నిర్మించాలని సంకల్పించామన్నారు. అదేవిధంగా ప్రభుత్వ నర్సింగ్ కాలేజీని మంజూరు చేయించామని, జిల్లా ఆసుపత్రిలో నూతన గదులు నిర్మించామని అన్నారు. ప్రజలకు సేవలు అందించే అధికారులకు కూడా సౌకర్యాలు అందుబాటులో ఉండాలన్న ఉద్దేశ్యంతో బోధన్ ఎంపీడీఓ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి చర్యలు తీసుకున్నామని తెలిపారు. శిథిలావస్థకు చేరిన బోధన్ మున్సిపల్ కార్యాలయ భవనం స్థానంలో త్వరలోనే రూ. 4 కోట్ల వ్యయంతో నూతన భవన నిర్మాణం చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి వివరించారు.

ఎమ్మెల్యే వెంట బోధన్ మున్సిపల్ చైర్ పర్సన్ పద్మావతి, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సంధ్య తదితరులు ఉన్నారు.

# స్నేహితుడి కుటుంబానికి మార్క్ ఫెడ్ చైర్మన్ ఆర్థిక సాయం

**వేగుచుక్క న్యూస్,ఆర్మూర్, డిసెంబర్ 3:**



పట్టణంలో నీ రాజారాంనగర్ లోని చిన్ననాటి స్నేహితుడు ఆకస్మికంగా అశోక్ మృతి చెందడంతో మార్క్ ఫెడ్ రాష్ట్ర చైర్మన్ మార గంగారెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించి రూ. 10 వేల ఆర్థిక సహాయాన్ని అశోక్ సతీమణి చౌల్ ప్రమీలకు అందజేశారు. రాజారాం నగర్ లోని స్నేహితుడి ఇంటికి సోమవారం వెళ్లి పరామర్శించి కుటుంబ సభ్యులు, అశోక్ కుమారులు చౌల్ సాయికిరణ్, అరవింద్, వినయ్ ల గురించి అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. వారి కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. మరో స్నేహితుడు ప్రముఖ వ్యాపారవేత్త పద్మ మురళి అశోక్ కుటుంబానికి రూ. 5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనంతరం గోల్ బంగ్లా వద్ద కౌన్సిలర్ బారడ్ రమేష్ తండ్రి గోపాల్ ఇటీవల మృతి చెందారు. వారి ఇంటికి వెళ్లి రమేష్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. వీరి వెంట మాజీ కౌన్సిలర్ సడాక్ వినోద్, సాత్ పుతె శ్రీనివాస్ ఉన్నారు.

## ముగ్గుల పోటీలను పరిశీలించిన కలెక్టర్.

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, డిసెంబర్ 3:**



ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలు సందర్భంగా పురపాలక సంఘం కార్యాలయంలో నిర్వహిస్తున్న రంగోలి, మెగా వైద్యశిబిరం ను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మంగళవారం పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కార్మికులకు, సిబ్బందికి నిర్వహిస్తున్న మెగా వైద్య శిబిరాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీఓ రంగనాథ్ రావు,మున్సిపల్ చైర్ పర్సన్ ఇందు ప్రియ, మున్సిపల్ కమీషనర్ శ్రీహరి, డిప్యూటీ ఈఈ వేణు గోపాల్, కౌన్సిలర్స్, తదితరులు పాల్గొన్నారు.

# అల్ఫోర్స్" అధ్యాపకురాలికి డాక్టరేట్.

**- అభినందించిన అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి. నరేందర్ రెడ్డి.**

**వేగుచుక్క న్యూస్, కరీంనగర్, డిసెంబర్ 3:**



స్థానిక కరీంనగర్ అల్ఫోర్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మాథమెటికల్ సైన్సెస్ లో ప్రిన్సిపాల్ గా విధులు నిర్వహిస్తున్న బాలసాని శ్రీనిత డాక్టరేట్ సాధించడం పట్ల అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి. నరేందర్ రెడ్డి అభినందించారు.

మొయినాబాద్ మండల పరిధిలోని హిమయత్ నగర్ లో గల చైతన్య డిమ్టూబీ యూనివర్శిటి కళాశాలలో గణితశాస్త్ర విభాగములో కంప్యూటేషనల్ ట్రీట్మెంట్ మరియు డైనమిక్స్ ఆఫ్ హీట్ అండ్ మాస్ ట్రాన్స్ఫర్ ఇన్ మైక్రోపోలార్ ఫ్లూయిడ్ ఫ్లో అనే అంశంపై ఆచార్య సుందర్రాం, ఎండీ. శంషోద్దీన్ల పర్యవేక్షణలో పరిశోధన నిర్వహించారు. దీనికి గాను డాక్టరేట్ ను చీఫ్ అడ్మినిస్ట్రేట్ అధికారిణి సాత్వికరెడ్డి అందజేసారు. దీనిని పురస్కరించుకొని మంగళవారం

అల్ఫోర్స్ లో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, అల్ఫోర్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మాథమెటికల్ సైన్సెస్ ప్రిన్సిపాల్ గా విధులు నిర్వహిస్తూ కూడ డాక్టరేట్ సాధించిన బాలసాని శ్రీనితను తాను ప్రత్యేకంగా అభినందిస్తూన్నానని అన్నారు. వారు ఇంక జీవితంలో అత్యున్నత శిఖరాలు అధిరోహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అల్ఫోర్స్ లో పనిచేసే అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# కనీస వేతన చట్టం అమలుకు కృషి.







**వేగుచుక్క న్యూస్, జగిత్యాల డిసెంబర్ 3:**



- నిరుద్యోగులకు, పట్టభద్రులకు భాసటగా ఉంటా.
- గ్రంధాలయాలను బలోపేతం చేస్తా.
- పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి.

రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు (మినిమమ్ బేసిక్ శాలరీ) కనీస వేతన చట్టం అమలుకు కృషి చేస్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి వెల్లడించారు. మంగళవారం జగిత్యాల జిల్లాలోని సారంగాపూర్, భీర్ పూర్ మండలాల్లో పలువురు పట్టభద్రులను కలసి, రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతు తెలుపాలని కోరారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారీ మెజారిటీ తో గెలిపిస్తే నిరుద్యోగ నిర్మూలకోసం, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టో లో పెట్టిన జాబ్ క్యాలెండర్ అమలుకు కృషి చేస్తానని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రంధాలయాల అభివృద్ధికి పాటు పడుతానని అన్నారు.

ప్రైవేట్ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు నగదు రహిత వైద్య సేవల అమలుతో పాటు, హెల్త్ కార్డులుజారికి కృషి చేస్తానని అన్నారు. ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు స్కాలర్షిప్ బకాయిలు రాక ఇబ్బందులు ఎదురుకుంటున్నారని, వారికీ పెండింగ్ బకాయిలు ప్రభుత్వం నుండి ఇప్పించెందుకు కృషి చేస్తానని అన్నారు. కేజీబీవి లలో పని చేస్తున్న కాంట్రాక్టు టీచర్లకు తమకు ఉద్యోగ భద్రత లేదని, వారు వాపోతున్నారని, టీచింగ్ నాన్ టీచింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించి పరిష్కరిస్తానని అన్నారు. విద్య రంగం నుండి వచ్చిన తనకు, ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ట భద్రుల సమస్యల పై పూర్తిగా అవగాహనా ఉందని, వారి సమస్యల పరిష్కారం కోసం చిత్త శుద్ధి తో పని చేస్తానని హామీ ఇచ్చారు. రానున్న పట్టభద్రుల ఎన్నికల్లో తనకు మొదటి ప్రధాన్యత ఓటు వేసి భారీ మెజారిటీ తో గెలిపించాలని వేడుకొన్నారు. ఓటు నమోదుకు ఈ నెల 9వరకు ఎన్నికల కమీషన్ అవకాశం కల్పించిందని, ప్రతి ఒక్క పట్టభద్రుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

# ఘనంగా అర్బన్ డే ఉత్సవాలు.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, డిసెంబర్ 3**



: ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా మంగళవారం నిజామాబాద్ నగర పాలక సంస్థ, మెప్మా ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్ లో అర్బన్ డే ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంతో పాటు నగరంలోని నెహ్రూ పార్క్, గాంధీ చౌక్, ఇతర ప్రధాన కూడళ్ళను విద్యుత్ దీపపు కాంతులతో ముస్తాబు చేయగా, సరికొత్త అందాలతో వెలుగులీనాయి. అర్బన్ డే కార్యక్రమం సందర్భంగా మెప్మా మహిళా సంఘాలకు రుణాలు పంపిణీ చేశారు. 128 స్వయం సహాయక సంఘాలకు రూ. 10.52 కోట్ల విలువ చేసే చెక్కులు అందజేశారు. ఇందిరా మహిళా శక్తి పథకం కింద 32 మంది సభ్యులకు కోటి రూపాయల చెక్కు పంపిణీ చేశారు. వీధి విక్రయదారులకు స్వనిధి పథకం కింద 50 మందికి రూ. 15 లక్షల ఆర్థిక తోడ్పాటు కల్పించారు. అదేవిధంగా నూతన పారిశ్రామికవేత్తలుగా గుర్తించబడిన ఎనిమిది మంది మహిళా ఎంటర్ ప్రెన్యూర్స్ ను మహిళా శక్తి పేరిట ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ తోడ్పాటును సద్వినియోగం చేసుకుని, స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆర్థిక పరిపుష్టి సాధించాలని వక్తలు పిలుపునిచ్చారు. ఈ ఉత్సవాలలో నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, అదనపు కమిషనర్ శంకర్, డిప్యూటీ కమిషనర్ రాజేందర్, టౌన్ ప్రాజెక్ట్ ఆఫీసర్ రమేష్, మెప్మా సిబ్బంది, ఆయా బ్యాంకుల మేనేజర్లు, రిసోర్స్ పర్సన్ లు తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ప్రజా పాలన విజయోత్సవాల ప్రాముఖ్యతను చాటుతూ ఆలపించిన గేయాలు, ప్రదర్శనలు ఆహుతులను అలరింపజేశాయి. ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేయగా, పెద్ద సంఖ్యలో హాజరైన మహిళలు ఆసక్తిగా తిలకించారు.

# పీఏల దగ్గరే... అంతా కేసుల ఉచ్చు

శ్రీకాకుళం:రాజకీయ నాయకులకు వ్యక్తిగత కార్యదర్శులు ఎంతో కీలకం. నేతల డెయిలీ రొటీన్, ఇతరాత్ర వ్యవహారాలన్నీ ఆ పీఏలే చూస్తుంటారు. అందుకే నాయకుల రాజకీయ జీవితంలో పీఏలు భాగమవుతుంటారు. సాధారణంగా ఆ పీఏలకు తెలియకుండా నేతల జీవితాల్లో ఏదీ జరగదు. అందుకే ఆ పీఏలను టార్గెట్ చేస్తూ గత ప్రభుత్వంలో ఆరోపణలు ఎదుర్కొన్న వైసీపీ నేతల గుట్టు బయటపెట్టడానికి కూటమి ప్రభుత్వం స్కెచ్ గీస్తున్నట్లు కనిపిస్తుంది.తాజాగా మాజీ డిప్యూటీ సిఎం ధర్మాన కృష్ణదాస్ వద్ద గతంలో ప్రభుత్వ పీఏగా చేసిన గొండు మురళి ఆస్తులపై ఏసీబీ రైడ్స్ నిర్వహించింది. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయన్న ఆరోపణల నేపథ్యంలో శాఖ, శ్రీకాకుళం జిల్లాలో మొత్తం ఆరు చోట్ల సోదాలు నిర్వహించారు ఏసీబీ అధికారులు. కృష్ణ దాసు ఎమ్మెల్యేగా, డిప్యూటీ సీఎంగా ఉన్న సమయంలో సుదీర్ఘకాలం ఆయన వద్ద మురళీ పీఏగా పని చేశారు. కృష్ణ దాస్కి సన్నిహితుడిగా మెలిగారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు తన మాతృశాఖ అయిన వైద్య ఆరోగ్యశాఖలోకి వెళ్లిపోయారు.ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లాలోని బుడితి కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో ఓ సాధారణ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న మురళీ ఆస్తుల వివరాలు చూస్తే కళ్లు తిరిగాల్సిందే. గొండు మురళికి చెందిన 20 ఎకరాలకు పైగా భూమి, విశాఖ, శ్రీకాకుళం సహా పలు ప్రాంతాల్లో పలు ప్లాట్లు, ఫ్లాట్లకు సంబంధించిన డాక్యుమెంట్లు, కిలో బంగారు ఆభరణాలు, 11.36 కిలోల వెండి వస్తువులు తదితరాలను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వాటి మార్కెట్ విలువ రూ.70 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. ఈ నేపథ్యంలో ఆయనను అరెస్టు చేశారు. ఆ ఆస్తులు మురళీ అక్రమార్జనా? లేకపోతే ఆయన ఎవరికైనా బినామీనా అన్న దానిపై విచారణ జరుగుతుందంట.ఇప్పటికే మదనపల్లె సబ్ కలెక్టర్ ఆఫీసు భూ రికార్డుల దహనం కేసులో నిందితుల కోసం పోలీసులు వేట కొనసాగిస్తున్నారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరుల కోసం గాలింపు చర్యలు చేపడుతున్నారు.

# అవినీతి నిరోధక వారోత్సవాల పోస్టర్లు ఆవిష్కరణ.







**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, డిసెంబర్ 3:** అవినీతి నిరోధక వారోత్సవాల సందర్భంగా వాల్పోస్టర్లను కలెక్టర్ రాజీవ్గాంధీ హనుమంతు, ఇన్ఛార్జి సీపీ సింధుశర్మ మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ ఏసీబీ డీఎస్పీ శేఖర్గౌడ్, ఇన్స్పెక్టర్లు నగేశ్, సీహెచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు. అధికారులు ఎవరైనా లంచం అడిగితే ఏసీబీ డీఎస్పీ 9154388950, ఇన్స్పెక్టర్లు 9154388951, 9154388953, టోల్ఫ్రీ నంబర్ 1064కు ఫోన్ చేయాలని సూచించారు.